

సెల్యూట్.. హైమన్

మార్లవాయిలో హైమన్‌డార్ఫ్ దంపతుల వర్ధంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆదిలాబాద్ ఎంపీ, జెడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు నివాళులర్పించారు. 8లో ▸



కుడారై ఉత్సవాలు 9లో ▸

మంచిర్యాల విశ్వనాథ ఆలయం, భీమారం మండలం కోదండరామాలయంలో ధనుర్మాసం సందర్భంగా కుడారై ఉత్సవాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.0 /13.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. పడమర దిశగా చలిగాలులు వీస్తాయి. చలి తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆస్పత్రిని సందర్శించిన కలెక్టర్, ఎమ్మెల్యే



సీబీపీ పనితీరును పరిశీలిస్తున్న కలెక్టర్

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ఏర్పాటు చేసిన వంద పడకల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని కలెక్టర్ భారతిహోళ్లికేరి, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య బుధవారం సందర్శించారు. ఆస్పత్రి స్థితిగతులు, సౌకర్యాల కల్పనపై సమీక్షించారు. వైద్యపరికరాలు, ఇతర యంత్రాలు సమకూర్చాలని, సౌకర్యాలు కల్పించాలని వైద్యాధికారులు, సిబ్బంది కలెక్టర్‌ను కోరారు. రోగులకు విశ్రాంతి కుర్చీలు, మెడిసిన్ ట్రాలీలు, ఐసీయూలో పార్టిషన్స్ సదుపాయాలు, ఆర్వోప్లాంటు, ఏసీ సౌకర్యం కల్పించాలని విన్నవించారు. ప్రాధాన్యత క్రమంలో సమకూరుస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అంతకుముందు రోగుల కోసం సీబీపీ, బయో కెమికల్ అనలైజర్స్ పరికరాలను ఎమ్మెల్యే, కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్య విధానపరిషత్ డీసీహెచ్ఎస్ డాక్టర్ అరవింద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ రవికుమార్, ట్రెయినీ కలెక్టర్ గౌతమి, బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్ పాల్గొన్నారు.

కంటివెలుగు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి

మంచిర్యాలటౌన్: ఈ నెల 18 నుంచి ప్రారంభించనున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బారాయుడు అన్నారు. బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమం కోసం ఏర్పాటు చేసిన 40 బృందాల్లోని మెడికల్ ఆఫీసర్, కంటి వైద్యుడు, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లకు అవగాహన కల్పించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో కంటివెలుగు క్యాంపులకు ప్రజలు వచ్చేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఏఆర్ మిషన్లు, ఇతర పరికరాలు ముందే పరిశీలించాలని సూచించారు.

విజయవంతం చేయండి

కోటపల్లి: కంటివెలుగు రెండో విడత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో కంటివెలుగు అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కంటి సమస్యలు ఉన్న వారు పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. అనంతరం ఎంపీపీ మంత్రి సురేఖ సాగు చేస్తున్న ఆయిల్‌పాం తోటలను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఓదెలు, ఎంపీడీవో భాస్కర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

గుడిపేట కార్యదర్శి హరిత సస్పెన్షన్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట జూనియర్ పంచాయతీ కార్యదర్శి(జేపీఎస్) ఎం.హరితను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ భారతిహోళ్లికేరి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. హరితపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తడం, అక్రమాలపై 'సాక్షి'లోనూ కథనాలు ప్రచురితం కావడం, గుడిపేట ఎంపీటీసీ ఒడ్డె బాలరాజు, స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపించారు. గ్రామసభలు, పంచాయతీ రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం, పంచాయతీ పోర్టల్‌లో పాత ఫొటోలు నమోదు చేయడం, ఇష్టారాజ్యంగా నిధులు వినియోగించడం, ఇళ్ల అనుమతుల విషయంలో అక్రమ వసూలు విచారణలో వెలుగులోకి వచ్చాయి. పంచాయతీ ఆదాయం పక్కదారి పట్టడంతో వేటు పడింది. కాగా, నంనూర్ జేపీఎస్ మల్లేశ్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ డీపీవో ఫణీందర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు.

రేషన్ బియ్యం పంపిణీ చేయాలి



బీజేపీ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వం రేషన్ బియ్యం తక్షణమే పేదలకు పంపిణీ చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి డిమాండ్ చేశారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో బుధవారం పార్టీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సమీపిస్తున్నా బియ్యం పంపిణీ చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. పేదలు ఇంట్లో పిండివంటలను చేసుకునే పరిస్థితి లేదని తెలిపారు. నాయకులు రజనీష్‌జైన్, తులా ఆంజనేయులు, పెద్దపల్లి పురుషోత్తం, వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, తోట మల్లికార్జున్, జోగుల శ్రీదేవి, గుర్రాల లావణ్య పాల్గొన్నారు.

గుర్తింపు కోసం పోరాటం





గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్‌కు మెమొరాండం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు సీతారామయ్య, బోస్, బాలరాజు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సింగరేణి కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని కార్మిక నాయకులు పోరాటం చేయాల్సి వస్తోంది. కార్మిక శాఖ, యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోతోంది. చివరికి ఎన్నికల నిర్వహణలో జాప్యంపై గత ఆగస్టులో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ విన్నపం మేరకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర, రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన మంత్రిత్వ శాఖలు, కమిషనర్లు, సింగరేణి సీ అండ్ ఎండీకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పుతో ఎన్నికలు అనివార్యమని అందరూ భావిస్తూ.. గనులపై ప్రచారం, యాత్రలు, గేట్‌మీటింగ్‌లు ప్రారంభించారు. అయితే ఇప్పటికీ స్పష్టమైన ప్రకటన వెలువడలేదు. తాజాగా బుధవారం హైకోర్టు తీర్పు అమలు చేస్తూ ఎన్నికలు నిర్వహించాలంటూ ఏఐటీయూసీ నాయకులు డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్‌కు మెమొరాండం ఇచ్చారు. అధికారులను కలుస్తూ.. వినతులు ఇస్తూ రెండేళ్లుగా పోరాడుతున్నా ఎన్నికల నిర్వహణ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. కోర్టు తీర్పు ఉల్లంఘన కింద మరోసారి కోర్టును ఆశ్రయిస్తామని నాయకులు హెచ్చరించారు.

కార్మికుల్లో నిరాశ

కంపెనీలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరిగి ఐదేళ్లు అవుతోంది. 2017లో జరిగిన ఎన్నికల్లో గెలిచిన టీబీజీకేఎస్ పదవీ కాలం 2019అక్టోబర్‌లో ముగిసి మూడేళ్లు అవుతోంది. కోవిడ్ ప్రభావం, యాజమాన్యం బొగ్గు ఉత్పత్తిపై ప్రభావమంటూ జాప్యం చేస్తూ వస్తోంది. ఈ ఆలస్యంపై కేంద్ర, రాష్ట్ర కార్మిక శాఖ ఉన్నతాధికారులకు విన్నవించారు. రాష్ట్ర ప్రభుత్వం ఓటమి భయంతో సంస్థపై ఒత్తిడి తెస్తూ తాత్సారం చేయిస్తోందని ప్రతిపక్ష కార్మిక నాయకులు ఆరోపిస్తున్నారు. ఎన్నికలకు తమ సంసిద్ధతను 17 సంఘాలు తెలిపాయి. మరోవైపు పదవీ కాలం ముగిసినా టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగానే చెలామణి కావడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ కొందరు అధికారులు ఆ సంఘాన్ని గుర్తింపు సంఘంగానే భావిస్తున్నారంటూ ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ క్రమంలో వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కోరుతున్నా అటువైపు ముందడుగు పడకపోవడంతో కార్మికుల్లో నిరాశకు గురవుతున్నారు.

యాజమాన్యం నిరాసక్తత

ఎన్నికల నిర్వహణకు కంపెనీ మొదటి నుంచీ ఆసక్తి చూపించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఉత్పత్తి, రవాణాపైనే దృష్టి అంతా కేంద్రీకరించి, పట్టించుకోవడం లేదని నాయకులు అంటున్నారు. వచ్చే మార్చిలో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న తరుణంలో సంస్థకు ఈ మూడు నెలలు ఉత్పత్తి, రవాణాకు కీలకం. వంద రోజుల లక్ష్యం విధించుకుని రోజుకు 2.3లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 16లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగించాలనే ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఈ ఏడాది 70మిలియన్ల టన్నుల లక్ష్యాన్ని చేరేందుకు ప్లాన్ వేసింది. ఈ క్రమంలో ఎన్నికల నిర్వహణకు కంపెనీ ముందుకు రాకపోవచ్చనే అనుమానాలు ఉన్నాయి. ఈ ఏడాది డిసెంబర్‌లోపు రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో రాష్ట్రంలో ఆరు జిల్లాలో విస్తరించిన సింగరేణి కార్మిక ఎన్నికలు అధికార, ప్రతిపక్ష పార్టీలకు ఎంతో ప్రతి ష్టాత్మకం. కార్మిక సంఘ ఎన్నికల ఫలితాలు సాధారణ ఓటర్లను ప్రభావితం చేయనున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాదైనా ఎన్నికలు ఉంటాయా? ఉండవా? అనే సందేహాలు కార్మికులు వ్యక్తం చేస్తున్నారు.

సైన్స్‌తోనే జీవితం



జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులతో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, అధికారులు

- శాస్త్రీయంగా ఆలోచించాలి
- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- ముగిసిన రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్, ఇన్‌స్పైర్ మానక్
- జాతీయస్థాయికి 26 ప్రాజెక్టులు ఎంపిక
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



విద్యార్థినుల ప్రదర్శన

నిర్మల్‌టౌన్: సైన్స్ లేనిదే జీవితం లేదని, నిత్యం మనం చేసే ప్రతీ పనిలో సైన్స్ అంతర్లీనంగా ఉంటుందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ పాఠశాలలో మూడు రోజులు నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్, ఇన్‌స్పైర్‌మానక్ ప్రదర్శనలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రస్థాయి ప్రదర్శనలో ఉత్తమంగా నిలిచిన, జాతీయ స్థాయికి ఎంపిక చేసిన 26 ప్రాజెక్టులు తయారు చేసిన విద్యార్థులకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ శాస్త్ర సాంకేతికరంగా వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రతీ అంశాన్ని శాస్త్రీయంగా ఆలోచించాలని సూచించారు. జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ పోటీల్లోనూ రాణించి తెలంగాణ కీర్తిని చాటాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి ప్రదర్శనలు నిర్వహించే అవకాశం నిర్మల్‌కు రావడం అదృష్టమన్నారు. 33 జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు దేనికదే గొప్పగా ఉందని తెలిపారు. కొత్త కొత్త ఆలోచనలతో సృజనాత్మకతతో దేశానికి ఉపయోగపడే ప్రాజెక్టులు రూపొందించాలని సూచించారు. రాష్ట్రస్థాయి సైన్స్ ఫేర్‌ను విజయవంతం చేసిన జిల్లా అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. కలెక్టర్ ముషరఫ్ అలీ మాట్లాడుతూ మన జీవితంలో సైన్స్ ఒక భాగమైందన్నారు. సైన్స్‌తోనే జీవిత ముడిపడి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యాశాఖ, సంబంధిత శాఖల అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పలు పాఠశాలల విద్యార్థులు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడేలా, పండుగల విశిష్టతను తెలిపేలా ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమంలో ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, అదనపు కలెక్టర్ హేమంత్ బోర్కడే, డీఈవో రవీందర్‌రెడ్డి, సైన్స్ అధికారి సురేశ్‌బాబు, శాస్త్ర సంకేతికశాఖ అధికారి శ్రీనివాస్, ఎంపీపీ రమేశ్వర్‌రెడ్డి, డాక్టర్ దేవేందర్‌రెడ్డి, రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ సంఘాల నాయకులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రముఖులు పాల్గొన్నారు.

జూనియర్ విభాగంలో మొదటి 7 స్థానాల్లో నిలిచిన విద్యార్థులు

విద్యార్థి	పాఠశాల
కె.యశ్వంత్	ఆదర్శ పాఠశాల(జయశంకర్ భూపాలపల్లి జిల్లా)
శ్రీపాద	అల్ఫోర్స్ పాఠశాల(వరంగల్)
మన్వితరెడ్డి	ఏకశిల టెక్నో స్కూల్(హనుమకొండ)
వర్షిత	డిస్నీ ల్యాండ్ స్కూల్(హనుమకొండ)
రక్షిత	జెడ్పీహెచ్‌ఎస్ రామన్నగూడెం(ములుగు)
పూజ	జెడ్పీహెచ్‌ఎస్ అహ్మదిపుర(సిద్దిపేట)
ఎండీ.రిజ్వాన్	మైనార్టీ పాఠశాల(భూపాలపల్లి)

సీనియర్ విభాగంలో మొదటి 7 స్థానాల్లో నిలిచిన విద్యార్థులు

సందీప్	అక్షర పాఠశాల(వికారాబాద్)
శ్రీహరిణి	పారామిత పాఠశాల(కరీంనగర్)
రోహిత్	జెడ్పీహెచ్‌ఎస్(నిజామాబాద్)
నమ్రుత్	జెడ్పీహెచ్‌ఎస్(సిద్దిపేట)
వంశీకృష్ణ	విజయ పాఠశాల(నిజామాబాద్)
రామ్‌చరణ్	జెడ్పీహెచ్‌ఎస్(వికారాబాద్)
గణేశ్	టీఎస్ఎంఎస్ పాఠశాల(హనుమకొండ)

జాతీయస్థాయికి ఎంపికైన ప్రాజెక్టులు ఇవీ..

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనలో 33 జిల్లాల నుంచి 257 మంది విద్యార్థులు తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిలో 26 ప్రాజెక్టులను న్యాయనిర్ణేతలు జాతీయస్థాయికి ఎంపిక చేశారు. ఆ ప్రాజెక్టులు.. క్లిక్ పేపర్ పెన్(జహా ఆసిఫ్), హ్యాండ్ స్టిక్(చింతల నవీన్), హెల్పింగ్ హ్యాండ్స్(సహస్ర), ఎగ్ షెల్ రిమూవర్(సమరత), కూలింగ్ సీలింగ్ ఫ్యాన్(సాన్విత), ఆండ్రాయిడ్ మొబైల్ కంట్రోల్డ్ వాయిస్(శైలజ), ఆటోమేటిక్ స్టాప్ వాటర్ హీటర్ (సిద్ధు), బ్రిక్ కౌంటింగ్ మిషన్(విగ్నేష్ కుమార్), స్పీచ్ టు బ్రెయిలీ(ఝాన్సీబాయి), పెల్ టీయర్ బ్లాంకెట్(అర్షితరెడ్డి), చిల్డ్రన్స్ లైఫ్ సేవర్ ఇన్ ట్రెన్ స్లీపర్ క్లాస్(రమ్యకృష్ణ), లైఫ్ సేవర్ వైపర్(స్వాతి), డ్రైవింగ్ షీట్ ఫర్ గ్రైన్స్(తేజస్విని), గ్రైన్ ప్రొటెక్టర్(మణిప్రసాద్), డ్రైవింగ్ అండ్ రోడ్ క్లీనర్(కుషీంద్ర), యాంటీ పాండమిక్ వాటర్ బాటిల్(హర్షిత), బోండా మేకింగ్ మిషన్(శ్రీనిధి), మష్రూమ్స్ అండ్ ఎకలాజికల్ ఆల్టర్నేటివ్ ప్లాస్టిక్స్(ఉమాదేవి), సింపుల్ కెన్ క్లీనర్(ధర్మేశ్), సేఫ్ లాకింగ్ అండ్ లాకింగ్ సిస్టం ఆఫ్ ఇన్సైడ్ మెయిన్ ఎంట్రెన్స్ డోర్(నాగరాజు), క్రాఫ్ డ్రయ్యర్ మిషన్(మహమ్మద్ కషీఫ్), రూఫ్ టఫ్ గ్యాబెజ్(హసిత), లోకాస్ట్ బోర్‌వెల్ కేసింగ్(అఫ్రీన్), పవర్ ట్రస్ట్ డిటెక్షన్ అండ్ ఇంటిమేషన్ ఎనర్జీ మీటర్(గణేశ్), అడ్జస్ట్ టేబుల్ గ్యాస్‌స్టౌ(నందిని), ఆటోమేటిక్ వెజిటేబుల్ కట్టర్(పూజ).

వణికిస్తున్న చలి



మంచిర్యాల జిల్లా నస్పూరు ఏరియాలో కమ్ముకున్న పొగమంచు

- భారీగా పడిపోతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- శీతలగాలులు.. కమ్మేస్తున్న పొగమంచు
- బయటకు రావాలంటే జంకుతున్న జనం

గత ఆరు రోజులుగా ఉష్ణోగ్రతలు

తేది	కనిష్టం	గరిష్టం
6	16.6	29.2
7	14.4	28.6
8	10.2	29.4
9	9.4	29.3
10	8.9	28.4
11	8.6	28.6

మంచిర్యాలఅగ్రికల్చర్: చలి తీవ్రతతో జిల్లా గజగజ వణికిపోతోంది. బుధవారం 8.6డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. చలికి తోడు తీవ్రమైన ఈదురుగాలులు వీస్తుండడంతో ఇంటి నుంచి బయటకు రావడానికి ప్రజలు జంకుతున్నారు. బారెడు పొద్దెక్కి, భానుడు ప్రతాపం చూపిస్తే గానీ జనాలు బయటకు రావడం లేదు. ఉదయం దట్టంగా పొగమంచు కమ్ముకుంటోంది. దీంతో ఉదయం 8గంటల వరకు రోడ్లపై ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో లైట్లు వేసుకుని ప్రయాణం చేయాల్సి వస్తోంది. పొద్దంతా ఎండతో ఉపశమనం పొందుతుండగా.. గ్రామీణ ప్రాంతాల్లో రాత్రివేళ చలిమంటలు వేసుకుంటున్నారు. నల్లాలు, ట్యాంకర్లు, బకెట్లలో నిల్వ ఉండే నీళ్లు ముట్టుకుంటే మంచుగడ్డను తలపిస్తున్నాయి. ఉదయం 10గంటల వరకు చలి ప్రభావం తగ్గడం లేదు. సాయంత్రం ఆరు గంటలకే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. రాత్రివేళ వ్యాపార సంస్థలు జనాలు లేక వెలవెలబోతున్నాయి.

పిల్లలు, వృద్ధులపై ప్రభావం..

చలిగాలులతో ప్రజలు జలుబు, దగ్గు, తదితర శ్వాసకోస వ్యాధుల బారిన పడుతున్నారు. వైరల్‌ఫీవర్ బారిన పడి ఆస్పత్రుల్లో బారులు తీరుతున్నారు. ఈదురుగాలులు వృద్ధులు, చిన్నపిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. విధులకు వెళ్లే సింగరేణి కార్మికులు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లే వారు చలికి ఇబ్బందులు పడుతున్నారు. తెల్లవారుజామున పేపర్‌బాయ్‌లు, మున్సిపల్ కార్మికులు, పాలు, కూరగాయలు అమ్మేవారు, కూలీ పని చేసుకునే కార్మికులు, వాచ్‌మెన్‌లు చలికి వణుకుతుండగా.. ఉదయాన్నే వాకింగ్ చేసేవారు వెనుకడుగు వేస్తున్నారు.

తగ్గుతున్న ఉష్ణోగ్రతలు

గత నెల మొదటివారంలో 11డిగ్రీలకు పడిపోయిన కనిష్ట ఉష్ణోగ్రతలు మరోమారు చలి ప్రభావం చూపిస్తున్నాయి. గత నాలుగు రోజులుగా ఆరు నుంచి 10 డిగ్రీల్లోపు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ నెల 6వరకు 15 డిగ్రీల పైన నమోదు కాగా, ప్రస్తుతం 10 డిగ్రీలలోపే నమోదు అవుతున్నాయి. యేటా డిసెంబర్‌లో చలి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఈసారి జనవరిలో కూడా అధికంగా ప్రతాపం చూపిస్తోంది. చలి నుంచి రక్షణకు స్వెట్టర్లు, జర్కిన్‌లు, గ్లౌజులు, మఫ్లర్లు ధరిస్తున్నారు. చలి తీవ్రత పెరగడంతో ఉన్ని దుస్తుల విక్రయ కేంద్రాల వద్ద జనాలు బారులు తీరారు. ఈ నెల 20 వరకు కనిష్ట ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు తెలిపారు.

హరితహారం లక్ష్యం పూర్తి చేయాలి

- కంటివెలుగు విజయవంతం చేయాలి
- కలెక్టర్ భారతి హోళ్లికేరి



మాట్లాడుతున్న కలెక్టర్ భారతి హోళ్లికేరి

మంచిర్యాలఅగ్రికల్చర్: హరితహారం కార్యక్రమం లక్ష్యాలు సాధించేలా అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ భారతిహోళ్లికేరి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, రాహుల్, ట్రెయినీ కలెక్టర్ గౌతమి, జెడ్పీ సీఈవో నరేందర్‌తో కలిసి జిల్లా అధికారులు, వ్యవసాయ, అటవీశాఖ అధికారులతో హరితహారం నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చనిపోయిన మొక్కలు తొలగించి నూతన మొక్కలు నాటాలని, ట్రీగార్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న కంటివెలుగు కార్యక్రమం విజయవంతం చేయాలని తెలిపారు. వంద రోజులపాటు సాగే ఈ కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకునేలా ప్రచారం చేయాలని అన్నారు. పరీక్షలు నిర్వహించి మందులు, కళ్లద్దాలు ఇవ్వడంతోపాటు అవసరమైన వారికి శస్త్రచికిత్స చేస్తారని పేర్కొన్నారు. బెల్లంపల్లి ఆర్డీవో శ్యామలాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, జిల్లా పశుసంవర్థక శాఖ జేడీ రమేష్, ఎఫ్‌డీవోలు మాధవరావు, రవీందర్‌రావు, సాహు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ తొలగింపు, డిప్యూటీ వార్డెన్ సస్పెన్షన్



డీసీవోను చుట్టుముట్టిన విద్యార్థులు

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కేవీఎం ప్రకాశ్‌రావును విధుల నుంచి తొలగిస్తూ, డిప్యూటీ వార్డెన్ అశోక్‌ను సస్పెండ్ చేస్తూ గురుకుల పాఠశాలల కార్యదర్శి మల్లయ్యభట్టు ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా కృపాసాగర్, ఇన్‌చార్జి వార్డెన్‌గా భాగ్యజ్యోతిలను నియమించారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల ఆర్సీవో గోపినాథ్ ఆదేశాల మేరకు బుధవారం మంచిర్యాల డీసీవో శ్రీధర్ పాఠశాలను సందర్శించారు. ఇన్‌చార్జీలతో మాట్లాడి బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం అందించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థుల ఆందోళన..

పాఠశాల ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రావు, డిప్యూటీ వార్డెన్ అశోక్‌లపై చర్యలు తీసుకోవద్దని విద్యార్థులు ఆందోళనకు దిగారు. డీసీవో శ్రీధర్‌ను చుట్టుముట్టి ప్రిన్సిపాల్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. డీసీవో హామీ ఇవ్వకపోవడంతో విద్యార్థులు పాఠశాల ఎదుట రోడ్డుపై బైఠాయించారు. విద్యార్థుల ఆవేదనను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తానని డీసీవో హామీనివ్వడంతో ఆందోళన విరమించారు.

'ఉపాధి'లో అవినీతి, అక్రమాలు

- పనులు చేయకుండానే నిధులు డ్రా
- 13వ సామాజిక తనిఖీ ప్రజావేదికలో వెల్లడి
- సిబ్బందిపై డీఆర్‌డీవో ఆగ్రహం



ప్రజావేదికలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో శేషాద్రి

బెల్లంపల్లిరూరల్: మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలు, అక్రమాలు, అవినీతి చోటు చేసుకున్నాయి. మండలంలోని 17పంచాయతీల్లో 2019 నవంబర్ నుంచి మార్చి 2022వరకు చేపట్టిన పనులపై ఈ నెల 5నుంచి 10వరకు సామాజిక తనిఖీ చేపట్టారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన 13వ సామాజిక తనిఖీ ప్రజావేదికలో వెలుగు చూశాయి. ప్రజావేదికకు డీఆర్‌డీవో బి.శేషాద్రి హాజరయ్యారు. చాకేపల్లి పంచాయతీలో రూ.1.20లక్షలతో నిర్మించిన పశువుల పాకను ఇంటి అవసరాలకు వినియోగించుకుంటున్నట్లు తేలగా డీఆర్‌డీవో విచారణకు ఆదేశించారు. ఇద్దరు ఆశా కార్యకర్తలు ఉపాధి హామీలో పని చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ సొమ్ము రికవరీకి ఆదేశించారు. రూ.30లక్షలతో నీటిగుంతల తవ్వకాలు చేపట్టగా పనులు సక్రమంగా జరగలేదని వివరించారు. కన్నాల పంచాయతీలో కూలీల సంతకాలు ఫోర్జరీ చేసి పనులు పూర్తి కాకుండానే రూ.90వేలు డ్రా చేసినట్లు తేలింది. ఇంకుడు గుంతలు నిర్మించకుండానే రూ.60వేలు డ్రా చేయగా విచారణకు ఆదేశించారు. ఆయా పంచాయతీల్లో 15రోజుల్లో పనులు పూర్తి చేయాలని, లేనిపక్షంలో డబ్బులు రికవరీ చేయాలని సిబ్బందికి సూచించారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడితే ఉపేక్షించేది లేదని డీఆర్‌డీవో హెచ్చరించారు. అడిషనల్ డీఆర్‌డీవో దత్తారావ్, జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, ఎంపీపీ శ్రీనివాస్, మండల ప్రత్యేకాధికారి దుర్గాప్రసాద్, ఎంపీడీవో రాజేందర్, సామాజిక తనిఖీ బృందం ఎస్ఆర్‌పీలు, డీఆర్పీలు, ఏపీవో పాల్గొన్నారు.

క్లుప్తంగా

'గిరి'యువతకు ఉచిత శిక్షణ

ఆసిఫాబాద్/ఆసిఫాబాద్‌రూరల్: పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై మెయిన్స్ పరీక్షల కోసం గిరిజన యువతకు 3నెలల పాటు నిర్వహించే ఉచిత శిక్షణను గిరి యువత సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి బుధవారం తెలిపారు. శిక్షణలో ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ గిరిజన అభ్యర్థులు తమ ఫిజికల్ టెస్ట్ అడ్మిట్ కార్డుతో పాటు ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ ఒరిజినల్ సర్టిఫికేట్లు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, ఒక పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో ఉట్నూరులోని కేబీ కాంప్లెక్స్ యూత్ ట్రెయినింగ్ సెంటర్‌లో అడ్మిషన్ తీసుకోవాలని తెలిపారు. ఈ ఉచిత శిక్షణను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 78936 16392, 96667 48105 నంబర్లను సంప్రదించాలన్నారు.

మొర్రిగూడ కార్యదర్శి సస్పెన్షన్

జన్నారం: మండలంలోని మొర్రిగూడ గ్రామ జూనియర్ పంచాయతీ కార్యదర్శి చంద్రమౌళిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ భారతి హోళికేరి ఉత్తర్వులు జారీ చేశారు. ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావడం, విధుల్లో నిర్లక్ష్యం వహించడంతో సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో అరుణరాణి తెలిపారు.

ఆర్టీసీ డిపోలో వాషింగ్‌ప్లాంట్..!



వాషింగ్‌ప్లాంట్..

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీ బస్సులు పరిశుభ్రంగా ఉంచేందుకు మంచిర్యాల డిపోలో కొత్త వాషింగ్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. రూ.8 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన వాషింగ్ ప్లాంట్ బస్సుబాడీ సైడ్‌లు బ్రష్‌తో శుభ్రం చేస్తుంది. ఇదివరకు ప్రతిరోజు బస్సులను మ్యానువల్ పద్ధతిలో వాటర్ వాషింగ్ చేసిన బస్సులపై మరకలు అక్కడక్కడ కనిపిస్తుండేవి. ఆధునిక వాషింగ్ ప్లాంట్‌తో పూర్తిస్థాయిలో మరకలు తొలగనున్నాయని. ప్లాంటు వారంలోగా అందుబాటులోకి వస్తుందని మంచిర్యాల డిపో డీఎం రవీంద్రనాథ్ తెలిపారు.

తండ్రీకొడుకులకు గాయాలు



చికిత్స పొందుతున్న మోతీరాం

వాంకిడి: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిన ప్రమాదంలో తండ్రీకొడుకులకు గాయాలైన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కాగజ్‌నగర్ మండల పరిధిలోని లైన్‌గూడ గ్రామానికి చెందిన కనక మోతీరాం బుధవారం ఉదయం తన నాలుగేళ్ల కుమారుడు నరసింహను తీసుకుని ద్విచక్ర వాహనంపై మహారాష్ట్రలోని విరూర్ గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చే క్రమంలో వాంకిడి మండల కేంద్రంలోని చిక్లీ వాగు సమీపంలోని స్పీడ్ బ్రేకర్ వద్ద బైక్ అదుపుతప్పి కిందపడింది. ఈ ప్రమాదంలో మోతీరాంకు తీవ్ర గాయాలు కాగా 108లో జిల్లా ఆసుపత్రికి తరలించారు. కుమారుడి తలకు, కాలికి చిన్నపాటి గాయాలయ్యాయి. కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు అందలేదని ఎస్సై సాగర్ తెలిపారు.

సెల్యూట్.. హైమన్



డార్ఫ్ దంపతులకు నివాళులర్పిస్తున్న కలెక్టర్, జెడ్పీచైర్‌పర్సన్, ఐటీడీఏ పీవో, ఎమ్మెల్యేలు

- ఆత్మబంధువుకు ఘన నివాళి
- మార్లావాయిలో డార్ఫ్ దంపతుల వర్ధంతి
- హాజరైన ఎంపీ, ఐటీడీఏ పీవో, జెడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు

నార్నూర్(ఆసిఫాబాద్): ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపిన ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్, బెట్టీ ఎలిజబెత్ దంపతులకు బుధవారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని మార్లవాయిలో ఘనంగా నివాళులర్పించారు. ఆదివాసీ సంప్రదాయం ప్రకారం పుణ్యదంపతుల 36వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కుమురంభీం జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎంపీ సోయం బాపూరావు, ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి, ఎస్పీ సురేశ్‌కుమార్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ ఎంపీ గెడం నగేశ్‌తో పాటు ప్రముఖులు హాజరై నివాళులర్పించారు. ముందుగా గ్రామ పటేల్ ఇంటిముందు నుంచి డార్ఫ్ దంపతుల సమాధుల వద్దకు ర్యాలీగా వెళ్లి ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుమురంభీం, ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్, బెట్టీ ఎలిజబెత్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడారు.

- ఏడాదిలోగా రైతులకు పోడు పట్టాలు



ఎంపీ బాపురావుకు జ్ఞాపిక అందిస్తున్న ఆదివాసీలు

దశాబ్దాలుగా పోడు భూములు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజనులకు ఏడాదిలోపు పట్టాలు అందజేస్తామని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. పోడు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చేపట్టిన సర్వేలు పూర్తి అయ్యాయన్నారు. ఏడాదిలోపు పోడు రైతులకు పట్టాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

- గిరి గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు

గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామని ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి అన్నారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద మార్లావాయి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తున్నామన్నారు. త్వరలో మార్లావాయిలో గుస్సాడీ శిక్షణ కేంద్రం నిర్మించి, శిక్షణ ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

- ఆదివాసీలను పట్టించుకోని ప్రభుత్వం

ఆదివాసీలు అన్ని రంగాల్లో సహకరించాలంటే విద్య, వైద్య పరంగా అభివృద్ధి చెందాలని ఎంపీ సోయం బాపూరావు అన్నారు. ఆదివాసీలు ఎన్నో ఎళ్లుగా ఎదుర్కొంటున్న పోడు భూముల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఆదివాసీలు ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను అటవీశాఖ అధికారులు అన్యాయంగా లాక్కుంటున్నా పట్టించుకోవడంలేదన్నారు. ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టాలని సూచించారు. పోడు భూములతో పాటు అటవీహక్కు పత్రాలు అందజేసినప్పుడే మహనీయుల ఆశయం నేరవేరుతుందన్నారు.

వేదికపై రాజకీయాలు సరికాదు

ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపిన హైమన్ డార్ఫ్ దంపతుల వర్ధంతి వేదికను రాజకీయ వేదికగా మార్చేందుకు ఎంపీ ప్రయత్నించడం సరికాదని జెడ్పీచైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు స్వరాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలోనే సరైన గుర్తింపు వచ్చిందన్నారు.

ఆదివాసీ సంస్కృతిని కాపాడాలి

ఆదివాసీలు సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుతూనే విద్యావంతులు కావాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. విద్యతోనే సమాజం అభివృద్ధి సాధ్యమన్నారు. యువత ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

డార్ఫ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

ఆదివాసీల అభివృద్ధి కోసం డార్ఫ్ దంపతులు చేసిన కృషి గొప్పదని కుమురంభీ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. ఆదివాసీల జీవితాలు బాగుపడాలని డార్ఫ్ దంపతులు ఆశించారని, మహనీయుల ఆశయసాధనకు కృషి చేయాలన్నారు. ఆదివాసీలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందినప్పుడే వారికి నిజమైన ఘన నివాళి అర్పించినట్లు అవుతుందన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి, ఐటీడీఏ పాలక మండలి చైర్మన్ కనక లక్కేరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవ్‌రావు, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు ఇంతీయాజ్‌లాల, ఎంపీపీ కుమ్ర తిరుమల, వైస్ ఎంపీపీ చిర్లె లక్ష్మణ్, నిర్వహణ కమిటీ చైర్మన్ కనక వెంకటేశ్, పద్మశ్రీ అవార్డు గ్రహిత కనక రాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

50శాతం సబ్సిడీతో జీవాలు

- గొర్రెలు, మేకల పెంపకానికి ప్రోత్సాహం
- నేషనల్ లైవ్ స్టాక్ పథకం ద్వారా అందజేత
- అవగాహన లేక వెనుకబాటు
- కేంద్రం ప్రవేశపెట్టి 20 నెలలు..
- దరఖాస్తులు నామమాత్రమే..



గొర్రెల మంద

చెన్నూర్‌రూరల్: గొర్రెల, మేకల పెంపకంతో ఉద్యోగ, వ్యాపార అవకాశాలను కల్పించే విధంగా కేంద్ర ప్రభుత్వం నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ అనే పథకాన్ని ప్రారంభించి సబ్సిడీని అందజేస్తుంది. 2021-22లో ప్రారంభమైన ఈ పథకం 2026-27 వరకు అమలులో ఉండనుంది. దీన్ని ప్రారంభించి 20నెలలు గడుస్తున్నా సరైన అవగాహన లేదు. ఈ పథకాన్ని పశుసంవర్ధక శాఖ అమలు చేస్తోంది.

ఎలాంటి అర్హతలు ఉండాలి...

గొర్రెలు, మేకల పెంపకంపై ఆసక్తి ఉన్న వ్యక్తి లేదా సంస్థ లేదా సహాయక సంఘాలు ఎవరైనా ఈ పథకానికి అర్హులే. ప్రాంతీయత ఎలాంటివి పరిగణలోకి రావు. దరఖాస్తు చేసుకునే వారికి పశుపోషణలో అనుభవం ఉండాలి లేదా గొర్రె, మేకల పెంపకంపై ఏదైనా గుర్తింపు పొందిన శిక్షణ కేంద్రం నుంచి శిక్షణ పొంది ఉండాలి. లేదా సాంకేతిక సలహాదారులుగా అనుభజ్ఞులైన పశువైద్య సిబ్బందిని ఫామ్ నిర్వహణ నిమిత్తం నియమించుకోవాల్సి ఉంటుంది.

ఎంత యూనిట్ ఉంది...

కనీసంగా 10+5, గరిష్ఠంగా 500+5 గొర్రెలు లేదా మేకలను యూనిట్‌గా పరిగణిస్తారు. 300+15, 400+20 సైజ్ యూనిట్‌గా కూడా సబ్సిడీ లభిస్తుంది. గొర్రె, మేకల పునరుత్పత్తి కోసం ఈ పథకం వర్తిస్తుంది.

50శాతం సబ్సిడీ..

మొత్తం ప్రాజెక్టు వ్యయంలో 50శాతం లేదా రూ.50లక్షలకు మించకుండా సబ్సిడీ లభిస్తుంది. ప్రాజెక్టు వ్యయంలో లబ్ధిదారుడు 50శాతం వాటాను స్వయంగా పెట్టుకోవచ్చు లేదా ఏదైనా జాతీయ బ్యాంకు నుంచి లోన్ ద్వారా పెట్టుకోవచ్చు. లబ్ధిదారుడు ఏ జాతులను పెంచాలనుకుంటున్నారో వాటిని ప్రాజెక్టు రిపోర్టులో తెలియజేయాలి. దరఖాస్తుదారుని పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, అడ్రస్‌ప్రూఫ్, పాస్‌పోర్టు సైజ్ ఫొటో అవసరం. ఏదైనా బ్యాంకు నుంచి లోన్ పొందాలనుకుంటున్నారో ఆ బ్యాంకు అకౌంట్ వివరాలు, ఆ బ్యాంకు నుంచి నిర్ణీత నమూనాలో తీసుకున్న లోన్ అంగీకారపత్రం, ఆరు నెలల బ్యాంకు అకౌంట్ స్టేట్‌మెంట్, జీవాల పెంపకంపై అనుభవం ఉందని స్థానిక పశువైద్యాధికారితో సర్టిఫికెట్ పొందాలి. ఏ ప్రాంతంలో ఫామ్ పెట్టాలకుంటున్నారో ఈ ప్రాంతం ఫొటో జీపీఎస్ లోకేషన్, స్వంత భూమి అయితే ఈ భూమి పట్టాదారు పాసు పుస్తకం, లీజు భూమి అయితే అగ్రిమెంట్ పత్రాలు ఉండాలి. గ్రూపు ద్వారా పెట్టాలనుకుంటే సభ్యుల ఆధార్‌కార్డు, పాన్ కార్డు,ఫోన్ నెంబర్, అడ్రస్ అందజేయాలి.

దరఖాస్తు విధానం...

ఈ పథకంపై ఆసక్తి ఉన్న వారు ఎలాంటి దరఖాస్తు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. **డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.ఎన్ఎల్ఎమ్.** ఉదయమిత్ర.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. అన్ని డాక్యుమెంట్లను జీపీ ఫార్మెట్‌లో స్కాన్ చేసి పెట్టుకోవాలి. ఇలా ఈమెయిల్‌లో లాగిన్ అయిన తర్వాత స్వంత మోబైల్‌కి ఓటీపి వస్తుంది. ఆ ఓటీపి ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొని దరఖాస్తు ఫారం నింపాలి. దరఖాస్తులో అడిగిన ప్రతి కాలమ్ నింపుతూ అవసరమైన చోట సంబంధిత పత్రాలను అప్‌లోడ్ చేయాలి. ఫారమ్ నింపిన తర్వాత సబ్మిట్ చేయాలి. సబ్మిట్ చేసిన తరువాత సమాచారం సరిగా ఉన్నట్లయితే మోబైల్ నెంబర్‌కు, ఈ మెయిల్‌కు మీ దరఖాస్తు సమర్పించబడింది అనే సమాచారం వస్తుంది. మరింత సమాచారం కోసం ఎన్ఎల్ఎం.సపోర్ట్ ఃఎస్ఐడీబీఐ.ఇన్ ద్వారా నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ అధికారులను ఈమెయిల్ ద్వారా సంప్రదించవచ్చు.

ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలి



కేంద్ర ప్రభుత్వం లైవ్ స్టాక్ మిషన్‌ను ప్రారంభించింది. ఇది ఒక మంచి వ్యాపారం, ఉపాధి లభిస్తుంది. ఆసక్తి ఉన్న వారు గొర్రె, మేకల పెంపకంపై ఆసక్తి ఉన్న వారు సూచనలను పాటించి దరఖాస్తు చేసుకోవాలి.

– వై.రమేశ్‌కుమార్, జిల్లా పశువైద్యాధికారి

రెండు ప్రభుత్వాలు ప్రైవేటీకరణ వైపే

- హెచ్ఎమ్మెస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

శ్రీరాంపూర్: కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని టీఆర్ఎస్ ప్రభుత్వాలు సింగరేణి ప్రైవేటీకరణ వైపే పని చేస్తున్నాయని, దీని కోసం క్రమేంగా పావులు కదుపుతున్నాయని హెచ్ఎమ్మెస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తెలిపారు. బుధవారం ఆయన ఆర్కే 7 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కొద్ది కాలంగా సింగరేణికి ఒక్క బొగ్గు గని తవ్వడానికి కూడా కేంద్రం అనుమతి ఇవ్వకుండా అడ్డుకుంటుందన్నారు. వచ్చే కొత్త బ్లాకులను ప్రైవేటు పెట్టుబడిదారులకు వేలం వేసి అమ్ముతున్నారన్నారు. మరో పక్క రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పూరితంగా సింగరేణిలో ఉన్న పర్మినెంట్ పని స్థలాల్లో కూడా బొగ్గు తీసే పనులను కూడా ప్రైవేటు సంస్థలకు అప్పగించి పూర్తిగా కంపెనీని ప్రైవేటు మయం చేస్తుందని ఆరోపించారు. ఈ రెండు ప్రభుత్వాల వల్ల సింగరేణి భవిష్యత్తు ప్రశ్నార్థకంలో పడిందన్నారు. మరో ఎర్ర జెండా కార్మిక సంఘాలన్నీ కూడా కార్మికుల కోసం పోరాడకుండా గులాబీ పార్టీకిగులాం గిరి చేస్తూ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. వచ్చే గుర్తింపు సంఘం ఎన్నికల్లో హెచ్ఎమ్మెస్‌ను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఆ యూనియన్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు జీవన్‌జోయల్, కేంద్ర ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి, నాయకులు దాపు రమేశ్, దుర్గం లక్ష్మణ్, మీస కొమురయ్య, శ్రీనివాస్, గోళ్ల సత్యనారాయణ, రామకృష్ణ, కిషన్‌రెడ్డి, రమేశ్‌లు పాల్గొన్నారు.

ఓపెన్‌కాస్ట్‌లో కాంట్రాక్ట్ డ్రైవర్ల ఆందోళన

కాసిపేట: మందమర్రి ఏరియా కేకే ఓసీలో బుధవారం కాంట్రాక్ట్ కార్మికులు మరోమారు విధులు బహిష్కరించి సమ్మెకు దిగి ఆందోళన బాటపట్టారు. మంగళవారం సమ్మె చేపట్టగా అధికారుల హామీ మేరకు విరమించారు. ఆర్‌వీఆర్ కంపెనీ మేనేజర్ దురుసుగా ప్రవర్తించడం, దూషించడం, వేధించడంతో విసుగు చెంది అతడిని తొలగించాలని సమ్మె చేపట్టగా అధికారులు సర్దిచెప్పారు. తిరిగి బుధవారం సైతం అతడు డ్రైవర్ల వద్దకు వచ్చి దురుసుగా ప్రవర్తించాడు. దీంతో మళ్లీ డ్రైవర్లు విధులు బహిష్కరించారు. ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్ కలగజేసుకొని వారం రోజుల్లో అతడిని తొలగిస్తామని, అప్పటి వరకు కార్యాలయంలోనే ఉంటాడని, మీ వద్దకు వచ్చి ఎటువంటి ఇబ్బందులకు గురి చేయడని చెప్పడంతో సమ్మె విరమించి రెండో షిఫ్ట్‌లో డ్రైవర్లు విధులకు హాజరయ్యారు.

తహసీల్దార్‌తోపాటు మరో నలుగురిపై కేసు

భీమిని: మండలంలోని పెద్దగుడిపేటలో భూమి అక్రమంగా పట్టా, భూ మార్పిడి చేశారని బాధితుడి ఫిర్యాదుతో తహసీల్దార్ పరమేశ్వర్‌రెడ్డితో పాటు మరో నలుగురిపై కేసు నమోదైంది. వివరాల ప్రకారం ... పెద్దగుడిపేట గ్రామానికి చెందిన మానేపల్లి లచ్చయ్య 40 ఏళ్ల క్రితం చనిపోయాడు. ఇటీవల నెన్నెల మండలం జంగాల్‌పేట గ్రామానికి చెందిన మరో వ్యక్తిని మానేపల్లి లచ్చయ్యగా సృష్టించి ఆ భూమిని గిఫ్ట్ డీడ్ కింద ఏటకారి రాజ్‌కుమార్ పేరున పట్టాగా మార్చారు. దీంతో మానేపల్లి లచ్చయ్య కుమారుడు భీమయ్య తన తండ్రి భూమిని ఇతరుల పేరుకు ఎలా మారుస్తారంటూ తహసీల్దార్ కార్యాలయంతో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. అందులో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 7వ తేదీన ఫి ర్యాదు చేయగా తహసీల్దార్‌తో పాటు భూ మి అమ్మకాలు, కొనుగోలు చేసిన వ్యక్తులతో పాటు అందుకు సహకరించిన సాక్షులపై కేసు నమోదు చే శారు. ఈ విషయమై ఎస్సైని వివరణ కోరగా తహసీల్దార్‌తో పాటు లచ్చయ్య, రాజశేఖర్, శంకర్, శ్రీధర్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపాడు.

ఆర్‌కే1ఏ గనిని సందర్శించిన స్టార్‌రేటింగ్ బృందం



అధికారులతో మాట్లాడుతున్న సభ్యులు

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్‌కే 1ఏ గనిని స్టార్ రేటింగ్ తనిఖీ బృందం సభ్యులు బుధవారం సందర్శించారు. గనిలో రక్షణ పరంగా తీసుకుంటున్న చర్యలను అధికారులను అడిగితెలుసుకున్నారు. గనిలోపల గ్యాలరీ, రూఫ్, సపోర్టింగ్ సిస్టమ్‌ను పరిశీలించారు. కార్మికుల సంక్షేమంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ సీసీఓ కొత్తగూడెం సుబ్రహ్మణ్యం, రామగుండం రీజియన్ జీఎం సేఫ్టీ సాంబయ్య, తాడిచెర్ల జీఎం మోహన్ రావు, వరంగల్ నీట్ ప్రొఫెసర్ చంద్రశేఖర్, అడిషనల్ మేనేజర్ సీపీ అండ్‌పీ దిలీప్‌కుమార్‌దాస్, బెల్లంపల్లి జీఎం సేఫ్టీ జాన్ ఆనంద్, ఎస్ఓటు జీఎం కృష్ణారావు, ఏఎస్ఓ ఓదెలు, గని మేనేజర్ శ్రీధర్ రావు పాల్గొన్నారు.

బీఎస్సీ హార్టికల్చర్‌లో సీఓఈ విద్యార్థికి సీటు



సీటు సాధించిన విఘ్నేష్

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ) కళాశాల విద్యార్థుల విజయ పరంపర కొనసాగుతూనే ఉంది. ఆ కోవలోకే మరో విద్యార్థి చేరాడు. సెండే విఘ్నేష్ వనపర్తి జిల్లా మోజర్లలోని హార్టికల్చర్ కళాశాలలో బీఎస్సీ (హానర్స్) హార్టికల్చర్‌లో సీటు సాధించినట్లు సీఓఈ ప్రిన్సిపాల్ ఐనాల సైదులు తెలిపారు. 2020-23 విద్యాసంవత్సరానికి ప్రవేశాల కోసం ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర అగ్రికల్చర్ యూనివర్శిటీ నిర్వహించిన ఎంసెట్ కౌన్సెలింగ్‌లో విఘ్నేష్‌కు సీటు కేటాయించారు. ఎమ్మెల్యే చిన్నయ్య, సంక్షేమ గురుకులాల ఆర్సీఓ కొప్పుల స్వరూపారాణి, సీఓఈ ప్రిన్సిపాల్ ఐనాల సైదులు అభినందించారు.

పశువుల్లో కృత్రిమ గర్భధారణపై అవగాహన

దండేపల్లి: మండలంలోని గుడిరేవులో గోపాలమిత్ర కృత్రిమ పశుగర్భధారణ సెంటర్‌లో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని పశుసంవర్ధక శాఖ జిల్లా జేడీ రమేష్ సందర్శించారు. కృతిమ గర్భధారణ, ఉచిత పశుగర్భకోశ, చికిత్స అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం 13 గేదెజాతి, 22 ఆవుజాతి పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కృత్రిమ గర్భధారణ ద్వారా జన్మించిన దూడలకు నట్టల మందు వేశారు. పచ్చిగడ్డి కొరత ఉండకుండా గడ్డి విత్తనాలు వేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి ధన్‌రాజ్, సర్పంచ్ లింగవ్వ, వైస్ఎంపీపీ అనిల్ పాల్గొన్నారు.



మందులు పంపిణీ చేస్తున్న జేడీ రమేశ్

సమాజ సేవలో యువత



వాలీబాల్ కిట్లు అందజేస్తున్న స్నేహయూత్ (ఫైల్)

చెడు వ్యసనాలకు దూరంగా... సమాజ సేవలో ముందుంటున్నారు పలువురు యువకులు. అల్లరిగా తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోకుండా ఆపద ఉన్నవారికి ఆపన్నహస్తం అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు ఈ యువకులు. ఫోన్‌లో కాలక్షేపం చేయకుండా వారికి చేతనైన సాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు పలువురు యూతు సభ్యులు... 'ఉక్కు కండలు కలిగిన, చురుకైన యువకులను నాకిస్తే దేశ స్వరూపాన్ని మారుస్తా' అని చెప్పిన స్వామి వివేకానంద జయంతి (యువజన దినోత్సవం) సందర్భంగా ప్రత్యేక కథనం..

- ఆదర్శంగా స్నేహయూత్ సభ్యులు
- 15 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు
- వెయ్యియూనిట్ల రక్తదానం
- పలుమార్లు అవార్డులు
- నేడు స్వామి వివేకానంద జయంతి

జన్నారం: జన్నారం మండలం పొనకల్‌లో 15 ఏళ్ల క్రితం 15మంది సభ్యులతో ప్రారంభమైన స్నేహ యూత్ ఇప్పుడు 40మంది సభ్యులతో కొనసాగుతోంది. ఇప్పటి వరకు యూత్ ఆధ్వర్యంలో వెయ్యి యూనిట్ల రక్తదానం చేశారు. యూత్ సభ్యులను సంప్రదిస్తే ఎక్కడికైన వెళ్లి రక్తదానం చేయడంలో ముందుంటారు. కరోనా సమయంలో నిత్యావసరాలు అందజేయడంతో పాటు గ్రామాల్లో జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ ధైర్యం నింపారు. అలాగే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులకు మానసిక వ్యక్తిత్వ వికాశ నిపుణులతో మోటివేషన్ తరగతులు చేపడుతున్నారు. ఏకలవ్య ఫౌండేషన్ వారి సహకారంతో 3వేల మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేశారు. అలాగే మండల కేంద్రానికి చెందిన ఆర్టిస్ట్ రాజు కూతురు రోడ్డు ప్రమాదంలో గాయపడగా రూ.10500 సాయం అందజేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే ఉన్నాయి.



ఉమ్మడిజిల్లా ఆర్డీవో చేతులమీదుగా రూ.25వేల నగదు బహుమతి అందుకుంటున్న రమేశ్ (ఫైల్)

పలు అవార్డులు..

స్నేహయూత్‌కు కార్యక్రమాలకు పలు అవార్డులు, ప్రశంసలు దక్కాయి. 2006 లో బెస్ట్ లీడర్‌షిప్ అవార్డును యూత్ అధ్యక్షుడు దుమల్ల రమేశ్ అందుకున్నాడు. 2007లో రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు అందుకున్నాడు. 2016లో ఉత్తమ యువజన సంఘంగా ఎంపికైంది. వీటితో పాటు పలుమార్లు ప్రశంస పత్రాలను యువజన సర్వీసుల శాఖల నుంచి అందుకున్నారు.

ఏడుసార్లు రక్తదానం చేశాను



నేను ఐదేళ్ల క్రితం యూత్‌లో సభ్యునిగా చేరాను. రక్తదాన శిబిరాలతో పాటు, రక్తం అవసరమున్న వారికి అత్యవసర సమయంలో ఇప్పటి వరకు ఏడు సార్లు రక్తదానం చేశాను. యూత్‌లో సేవా కార్యక్రమాలు చేయడం ఆనందంగా ఉంది.

– బచ్చల శివకుమార్, యూత్ సభ్యుడు

సంతృప్తినిస్తున్నాయి



మూడేళ్లుగా నేను యూత్‌లో సభ్యుడిగా ఉన్నాను. అప్పటి నుంచి యూత్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నాను. ఇప్పటి వరకు మూడు సా ర్లు రక్తదానం చేశాను. యూత్ సభ్యునిగా చే స్తున్న సేవా కార్యక్రమాలు సంతృప్తినిస్తున్నాయి.

– దుమల్ల జైకుమార్, యూత్ సభ్యుడు

యువతను ప్రోత్సహించాలి



15 ఏళ్లుగా యూత్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో యువతను ప్రోత్సహిస్తూ స్టడీ టూర్స్, అడ్వంచర్ క్యాంపుల ఏర్పాటు చేస్తూ ప్రోత్సాహించేవారు. స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించే వారు. రాష్ట్రం ఏర్పటయ్యాక యువజన సంఘాలకు ప్రోత్సాహం కరువైంది.

– దుమల్ల రమేశ్, స్నేహయూత్ అధ్యక్షుడు

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

- పేపర్ ప్లేట్ & LED యంత్రాలను వ్యవస్థాపించి, ప్రతి నెల ఎక్కువ ఆధాయాన్ని సంపాదించండి, ఉచిత ముడి పదార్థాలు 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. ఫోన్ : 7217656207, 9717434570 [HA-19385]

WANTED

- Dherji సైట్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. PVR Projects Ltd., మహారాష్ట్ర. ఫోన్: 040-23348080, 23338080 Email:adm.vineela@gmail.com [HA-779938]
- త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను పేషెంట్స్‌ను చూసుకోవడానికి వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం, జీ. 18K ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్: 9848571888, 7569955551. [HA-786818]
- Wanted Operators - (15), Salary-15k, ESI + PF+ Accomidation, Qly: 10+, Ph: 9110783252 [HA-779937]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,

విద్యార్థిని కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్టు

నస్పూర్: పట్టణ పరిధిలోని అంబేద్కర్ కాలనీకి చెందిన విద్యార్థిని కిడ్నాప్ చేసిన నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం... విద్యార్థిని బంధువైన గుడిపల్లికి చెందిన శంకర్ కొంత కాలంగా విద్యార్థినిని ప్రేమిస్తున్నానని, తనను పెళ్లి చేసుకోవాలని వెంట పడి వేదిస్తున్నాడు. ఆమె కుటుంబ సభ్యులు దీనికి నిరాకరించారు. దీంతో విద్యార్థిని కిడ్నాప్ చేసి పెళ్లి చేసుకోవాలని శంకర్ నిశ్చయించుకున్నాడు. దీనికి శంకర్ బంధువైన శ్యాముల్, అతడి మిత్రులైన నస్పూర్‌కి చెందిన ఆటో డ్రైవర్ అంజన్న, చున్నంబట్టి వాడకు చెందిన అభిషేక్‌ల సహాయం తీసుకున్నాడు. విద్యార్థిని మంగళవారం కాలేజీకి వెళ్లి తిరిగి ఇంటికి బస్సులో బయలుదేరి అంబేద్కర్ కాలనీ వద్ద దిగింది. అప్పటికే అక్కడ వేచి ఉన్న శంకర్ మరో ముగ్గురు విద్యార్థినిని ఆటోలో బలవంతంగా ఎక్కించుకుని కోటపల్లి మండలం నాగంపేట వైపు తీసుకుని వెళ్లారు. విద్యార్థిని తేరుకుని 100కి డయల్ చేసింది. కోటపల్లి పోలీసులు అక్కడికి వెళ్లగా నిందితులు పోలీసులను చూసి పారిపోయారు. పోలీసులు విద్యార్థిని ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు. పారిపోయిన నిందితులలో శంకర్, అంజన్న, అభిషేక్ లను బుధవారంసీ సీసీ కార్నర్ వద్ద అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. వారి వద్ద నుంచి బజాజ్ ఆటో, మోబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, మరో నిందితుడు శ్యాముల్ పరారీలో ఉన్నాడని ఎస్సై తెలిపారు.

మల్కెపల్లిలో విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

కాసిపేట: మండలంలోని మల్కెపల్లిలో బుధవారం దొంతుల తిరుపతికి చెందిన ఇల్లు దగ్ధమైంది. ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లోని వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. తహసీల్దార్ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించి సుమారు రూ.లక్ష వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు తెలిపారు. సంఘటనా స్థలాన్ని మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు.